# 1. పరిశోధన

మా ఆవిడ చింపిరితలలోని పేలను నేను లెక్క పెట్టలేను సరికదా - ఊహించికూడా ఇన్ని వుంటాయని చెప్పలేను. ఆవిడ తినే చిరుతిండ్లకు ఆ పేలు తెగబలిసి, దినదిన ప్రవర్ధమానమై సంఖ్యలో మిక్కుటమయ్యాయి. పోనీ, అవి ఎట్లా చస్తేనాకేం? అవి అల్లా పెరిగి పెరిగి వూరుకుంటే నాకు ఏ దిగులూ వుండేదికాదు. కాని, ఆ పేలకు మా ఆవిడ బారెడు జడలో వుండే స్థలం సరిపోక, మెల్లిమెల్లిగా నా క్రాపులోకి కూడా ఎగుమతి అయ్యాయి! ఒకటా - రెండా? కొన్ని గ్రోసులు నల్లగా జీడిగింజల్లాగు, ఒక్కొక్కటి పెంకెపురుగంత పరిమాణంలో చూసేందుకు మహాచీదరగా వుండేవి. అవి నా తలలో కూడా సుస్థిరనివాసాన్ని యేర్పరచుకొని - సంఖ్యలో పెరిగిన కొద్దీ - నా తలమీద ఒకటన్ను దురదగొండాకు పులిమినట్టుగా, తల అమితమైన దురదతో బాధపడేది! పళ్ళన్నీ అరిగేటట్టు - అంటిపొడిచి దువ్వినా పోయేదికాదు ఆ దురద!

నిజంగా ఆ దురద సంగతి తలుచుకుంటే - నా కిప్పుడు ఏడుపు వస్తుంది! సలసలకాగే వేడినీళ్ళు బుర్రమీద పోస్తే - చస్తాయి ఈ పేలు అనుకుంటే - బుర్ర కాలుతుందికదా ఖర్మం! దువ్వెనను బుర్రమీద దబాయించి అదిమి అదిమి దువ్వినా దువ్వెన పళ్ళు విరగాల్సిందేకాని నా బుర్రమీది దురదమాత్రం తగ్గేది కాదు! పోనీ, ఇంత 'నైట్రిక్ ఏసిడ్' బుర్రమీద పోద్దామనుకుంటే - పేల మాట అట్లా వుంచి బుర్రమీది తోలు లేస్తుందాయె! బజారులో పోతూ - బుర్ర గోక్కుంటూ వుంటే నలుగురూ నవ్వుతారాయె! ఈ వెధవ దురద వల్ల ఆఫీసులో పనికూడా సరిగ్గా సాగేదికాదు. రెండు చేతులకూ బుర్రగోకే పనితప్ప - వేరొకటి చెయ్యబుద్ధిపుట్టేది కూడా కాదు! కాని గోకినంతసేపూ - చమ్మ చమ్మగా వుండేది.

ఇంక మా ఆవిడ వాటి బాధ ఎలా భరిస్తుందో ఆ పరమేశ్వరుడికే ఎరుక!

"ఇవ్వేమి పేలే?" - అన్నాను ఒకనాడు.

"ఊ! నా తలలో పేలెక్కడివి? మీ తలలోనే ఉండి వుండాలి" - అంది కోపంతో.

"పోనీ ఆ పేలు పోయే వుపాయం చూడకూడదా?"

"అయితే వాటిని చంపమంటారా?"

"ఏం! చంపుతే?"

"జీవహింస కాదుటండీ?" - అంది ఆ వెధవ మృగాలకు సానుభూతిగా. మా ఆవిడకు సమాధానం చెప్పలేక నేనే నోటికి బిరడా పెట్టుకున్నా.

ఇట్టి క్లిష్ట పరిస్థితిలో పడి బాధ భరించలేక ఈ పేలను వదలగొట్టుకునే మార్గం యేదా అని ఆలోచించాను. ఆ అపరిమితమైన దురదబాధకు, ఒక్కొక్క సమయంలో - కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చి, ఏకాంతంగా కూర్చొని, ఆవుర్న ఏడ్చేవాణ్ణి.

ఏ మహాశయుడన్నా యీ పేల బాధనుంచి విముక్తి చెందే మందును ప్రకటించేదేమోనని జనవాణి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ప్రజాబంధు, వాహిని ఒకటేమిటి - కనబడ్డ ప్రతిపత్రికనూ తిరగవేశాను. ఇతర ప్రకటనలు ఎన్నో ఉన్నాయి కాని - ఈ పేలను గురించిన ప్రసక్తేలేదు. అసలు యీ పేల గొడవ - లోకంలో నాకు తప్ప ఎవరికీ పట్టనట్టే తోచింది.

పోనీ డాక్టరుగార్ని సలహా అడుగుతే? ఆయన ఏమనుకుంటాడో? నన్ను ఒక శుంఠకింద జమకట్టడుకదా? పోనీ లోలోపల యేమనుకున్నా - ఈ పేలు వదలుతే అదే పది వేలని ఆ డాక్టరుగారింటికి వెళ్ళాను.

అక్కడ డాక్టరుగారు రకరకాల రోగుల్నీ పరీక్షిస్తున్నారు. నాకు ఏమీతోచక, దురద బాధ ఎక్కువవటంవల్ల బుర్రగోక్కుంటూ - డాక్టరుగారి ఎదుట నిలబడ్డాను.

డాక్టర్ గారు "ఏమండీ! ఏం కావాలి?" అని అడిగారు.

నేను, అందరిలోనూ యీ వెధవ పేలసంగతి చెప్తే, పరువునష్టమని - "తమతో కొంచెం, రహస్యం మాట్లాడాలి సార్" అన్నాను. డాక్టర్ గారు తలవూపి, నన్ను తన ప్రైవేటు గదిలోకి తీసుకువెళ్ళారు. అక్కడ, ఆయనకు యీ పేల పుట్టుపూర్వోత్తరాలూ వాటి అఘాయిత్యమూ విపులంగా చెప్పా.

అంతా విని ఆయనకూడా నాలాగే బుర్రగోక్కుంటూ ఆశ్చర్యంగా, "నా యీ పుష్కరం ప్రాక్టీసులోనూ - నేను చేపట్టకపోయినా - ఇలాటి కేసుసంగతి విననైనాలేదు! అయినా ఇతర డాక్టర్లతో కూడా ఆలోచించి చెప్తాను, రేపు రండి" అన్నారు. నేను తప్పనిసరిగా తిరిగి బుర్రగోక్కుంటూ యింటివైపు మళ్ళాను.

మళ్ళీ మర్నాడు ఉదయం డాక్టర్‌గార్ని కలుసుకుంటే ఆయన "రాత్రంతా జాగారంచేసి, ఎన్ని పుస్తకాలు తిరగేసినా - నాకు యీ పేల సంగతే కన్పించలేదు. చాలా మంది డాక్టర్లను అడిగిచూశాను కాని, వారికేమీ పాలు పోక, తెల్లమొగాలు వేశారు. ఈ పేల సంగతి, రిసెర్చ్ సంఘం వారికి తెలియపర్చవలసిందేకాని -

నాకుమాత్రం మరే వుపాయమూ తట్టటం లేదు" అన్నాడు. ఈ సోదంతా విని, నేను నిరాశ చేసుకొని - యింటిదారి పట్టాను.

రోజురోజుకూ, నా దురద పాపంలాగు పెరుగుతూనే వుంది; ఏ పనన్నా చేద్దామంటే బుర్రమీది చేతులు ఇవతలికి వస్తేనా? కాని నాకొక్క విషయం మాత్రం ఆశ్చర్యంగా వుండేది: నాకే ఇంత దురద అయితే - మరి మా ఆవిడకో? ఆవిడ ఎప్పుడూ తలగోకినట్టుకూడా కన్పించదు. బహుశా ఆవిడకు, ఆ దురద బాగా అలవాటైపోయి వుంటుంది!

క్రమేపీ, నా తలలో పేలువున్న సంగతి, నా స్నేహితులందరకూ తెలిసింది. మొదట్లో వాళ్లు నన్ను ఎగతాళి చేశారు. కాని, నేను నా బాధను వర్ణించాక- వారు నాకు సానుభూతి చూపారు. ఆ తరువాత, వారిలో ఒక్కొక్కరుగా - తమకుకూడా యీ పేల బాధ కొద్దోగొప్పో ఉందనే ఒప్పుకున్నారు. ఆడవాళ్ళ తలల్లో యీ పేలను సృష్టించిన భగవంతుణ్ణి శాపనార్థాలు పెట్టారు. వారుకూడా యీ పాడుపేలు వదిలే ఉపాయం కోసం, బుర్ర పాడయ్యేట్టు ఆలోచించారు; కాని లాభం లేకపోయింది. ఉపాయ మేమీ తట్టనందున, వారు, తమతమ మట్టి బుర్రల్ని తిట్టిపోసుకున్నారు.

ఇదేమీ లాభం లేదని స్వయం కృషి మొదలు పెట్టాను. నాకు నేను రిసెర్చ్ చేద్దామనుకున్నాను; ఒక ఆలోచన తట్టింది. 'పేల పిండి' అంటే ఏమిటి? పేలను చంపేదా? లేక పేలకు ఆహారమా? అనుమాన రహితంకోసం, తెలుగు నిఘంటువు వెతికాను. దాంట్లో ఆ పదానికి అర్థమే లేదు. ముందు ఈ 'పేలపిండి' మహిమేమిటో కచ్చితంగా తెలుసుకోవాలని, మా ఆవిడచేత, చిన్న డబ్బాకు పేల పిండి కొట్టించాను. రోజూ రాత్రి పడుకోబోయేప్పుడు, ఆ పేలపిండిని నెత్తినిండా చల్లేవాణ్ణి, ఉదయాన - ఆ పిండంతా పోయ్యేటట్టు, సబ్బూ, సున్నిపిండీ, కుంకుడుకాయలూ వేసి - మాడంతా రుద్దేవాణ్ణి. ఇలా పదిరోజులు గడిచాయి. కాని నాకేమీ ప్రయోజనం కన్పించలేదు.

ఈ పేలు నా తలను ఆక్రమించాక రోజూ రాత్రి సమయాల్లో నాకు సరిగ్గా నిద్రపట్టేదేకాదు! నెత్తిమీద పేలనాట్యమూ, కుక్కిమంచంలోని, నల్లుల విహారమూ - మిళితమై నిద్రా దేవతను నా దగ్గర్నుంచి పారద్రోలాయి. రోజూ రాత్రి పడుకో బోయేప్పుడు దీనంగా భగవంతుణ్ణి - నన్ను యీ పేల బాధ నుంచి విముక్తి చెయ్యమని - మనస్సులో ప్రార్థించేవాణ్ణి. పేలుపోతే ఆంజనేయస్వామికి అరడజను కొబ్బరికాయలు మొక్కుకున్నాను. కాని యీ వెధవ పేల అవస్థ భగవంతుడికి మాత్రం యిష్టమా? మరీ నేను పడే బాధను కళ్ళారాచూసి - యీ వెధవ జంతువుల్ని తీసికొని భగవంతుడు ఏం చేసుకుంటాడు?

ఏ దేవుడికీ నా దీనాలాపాలు వినబడలేదు - ఆ ఒక్క వెంకటేశ్వర స్వామికి తప్ప! ఒకనాడు తెల్లవారు జామున, ఆ స్వామివారు నాకు కలలో కనపడి, 'నా సన్నిధానానికి వస్తే - నిన్ను పేలనుంచి విముక్తి చేస్తాను' అన్నారు. స్వామివారి

వాగ్దానమయితే కమ్మగానే వుంది కాని, చేతి జిడ్డు వదిలించుకొని ఈ కరువుకాలంలో స్వామీజీని దర్శించటం ఎట్లా? పోనీ డబ్బుపోతే పోయిందనుకుంటే, మా మేనేజర్ సెలవు మంజూరు చేసే స్థితిలో లేడు! ఈ క్లిష్ట పరిస్థితినుంచి ఎలా విముక్తి చెందనా అని ఆలోచించసాగాను.

ఇంతలో క్రిష్టమస్ సెలవులు రానేవచ్చాయి. మదరాసు వెళ్ళవలసిన పని వొకటి తగిలింది. యం.ఎస్.యం. కంపెనీ వారి 'బైరాగి టిక్కెట్' వొకటి కొని మదరాసులో పని చూసుకొని - ఇంటికి తిరిగివస్తూ వుండగా - గూడూరు స్టేషన్‌లో అనేకమంది ప్రయాణీకులు కన్పించారు. ఏ మా గిరాకీ అని చూశాను - వాళ్ళందరూ తిరుపతి వెళ్తున్నారు. అప్పుడు నాకు నా స్వప్న వృత్తాంతం తలపుకు వచ్చింది. ఇదే మంచితరుణము, మించిపోతే లాభం లేదని, నేను కూడా ఇంటిదారి తప్పించి తిరుపతి వెళ్ళాను - వేంకటేశ్వరస్వామి వారి మహత్యాన్ని స్వయంగానే తెలుసుకుందామని!

తిరుపతిలో, మోకాటి పర్వతాన్ని దేక్కుంటూ ఎల్లాగయితేనేం ఏడుకొండలూ దాటి, స్వామివారి మ్రోల నిలబడ్డా. స్వామివారికి సాష్టాంగ దండప్రణామంచేసి 'స్వామీ! తమ ఆజ్ఞననుసరించి, తమ సన్నిధానానికి రానే వచ్చాను. నీ మళయాళమంత్రాన్ని ప్రయోగించి, నా పేల మీద ఘోర దండయాత్ర సాగించి - యీ నీ పాదదాసుణ్ణి రక్షించ' మని మనస్సులో ప్రార్థించుకున్నాను.

అక్కడకు వచ్చిన యాత్రికులందరూ తమ జుట్టును స్వామివారికి కానుకగా యిస్తున్నారు. దినాన ఆ పర్వతం మీద - కొన్నివేల బోడిగుండ్లు తయారవుతున్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తే నాకు - అది బోడిగుండ్ల కార్ఖానాయా లేక స్వామివారి ఆలయమా అన్న సందేహంకూడా కలిగింది. అప్పుడు నేనుకూడా, 'నలుగురితోపాటు నారాయణా' అని నా జుట్టుకూడా స్వామివారికి అర్పిద్దామనుకున్నాను. క్రాపు కూడా స్వామివారి కాన్కకు వీలుగా ఒత్తుగా పెరిగివుంది. డబ్బా, దస్కములేని యీ స్వల్పకానుకను స్వామివారికి అర్పించేందుకు, నాకేమీ సందేహం కలగలేదు.

ఇంకేం - కొండమంగలి, నాతలను తన రెండుచేతుల మధ్యా బిగించిపట్టుకొని - తల విరిగేటట్టు ముందుకులాగి పట్టి - తన మొండికత్తితో, పనసకాయ చెక్కు తీసినట్టు - మూడునిమిషాల్లో నా జుట్టంతా తీసివేశాడు. తలమీద చెయ్యిపెట్టుకొని చూచుకొందును - నున్నటి క్రాపుకు బదులు - నున్నటి బోడిగుండు తయారయింది! ఇదంతా 'కలయో వైష్ణవమాయయో!' అనిపించింది. ఆరివీడితస్సాదియ్యా! మూడు నిమిషాల్లో, హస్తలాఘవం చేసేశాడు. గుబురుగా పెరిగివున్న నా జుట్టు, నేలమీద చిన్నగుట్టగా పోగుపడ్డది! అద్దంలో చూచుకొన్నాను. నన్ను నేనే గుర్తించ లేకపొయ్యాను. ఏం బోడిగుండు! జాగ్రాఫికల్ గ్లోబులాగు - గుండ్రంగా, గుమ్మటంలాగు వుంది. ఎంత నునుపు! చెయ్యివేస్తే జారిపోతోంది; కొంచెం ఆముదంకూడా పూస్తే - కళాయి పెట్టిన యిత్తడి గిన్నెలాగు - తళతళలాడుతూ - పాలరాతిలో లాగు ప్రతిబింబం

కనిపించవలసిందే ! ఇంత మంచిబోడిగుండును సంపాదించగలుగుతా ననుకోలేదు. ఇది ఏడుకొండల వాడి మహత్యమే అయి వుంటుందనుకొని, తిరుపతిలో చూడవలసినవన్నీ చూచి, ఆ రాత్రే రైలెక్కాను – మా ఆవిడ నా బోడిగుండును చూచి ఏమనుకుంటుందో ననుకుంటూ.

ఇంకో విశేషాన్ని నేను గుర్తించగలిగాను. పూర్వం లాగు, బుర్రనుగోకే శ్రమ నా చేతులకు తప్పింది. ఎక్కడి పేలు అక్కడే – 'ఎక్కడి దొంగలక్కడే గప్‌చిప్' అన్నట్టు సర్దుకున్నాయి. బహుశా అవన్నీ స్వామివారికి బహుమతిగా పోయివుంటాయి. స్వామివారి మ్యూజియమ్‌లో యీ జంతుజాలం పెరిగేందుకు తగిన తావుంది కాబోలు! ఇన్నాళ్ళూ ఎంతమంది డాక్టర్లు యీ పేలను వదలకొట్టే ఉపాయాన్ని అన్వేషిస్తున్నారో – ఎంతమంది స్త్రీలు, పురుషులు, పిల్లలూ, జెల్లలూ – జంతువులు కూడా, యీ పేలబాధతో వేగుతున్నారో – రిసెర్చ్ సంఘాలలో ఎంతమంది ప్రముఖులు యీ పేలను గురించి బుర్రలుగిర్రున తిరిగేలాగు ఆలోచనా సాగరంలోపడి దారీదాపూ కానక ఉక్కిరిబిక్కిరవుతున్నారో కాని, నేను మాత్రం వీటికి తరుణోపాయాన్ని, సూక్ష్మంలో మోక్షం పొందేవిధానాన్ని కనిపెట్టగలిగాను. కాదు – నేను కాదు! ఇది నిజంగా వెంకటేశ్వరస్వామివారి మహత్యం కాకుంటే – నా దగ్గర యింత తెలివి వుందా? ఈ నా కొత్త పరిశోధనా ఫలితాన్ని విని నా స్నేహితులు నాకు ధన్యవాదాలిచ్చి, నా మెడలు విరిగేటట్టు పూలదండలువేసి, నాకు ఫొటోలుతీసి – పత్రికలన్నీ నన్ను గుఱించి వేనోళ్ళపొగుడుతూ రాస్తే – నిజంగా నేను ధన్యుణ్ణి! ఎంత గౌరవం వస్తుంది! ఎంత మందిని యీ పాడు పేల బారినుండి నేను తప్పించగలుగుతాను! ఇలాటి ఊహాసౌధాల్ని నిర్మించుకుంటూ నేను ఇల్లు జేరుకున్నాను.

❋ ❋ ❋

నన్ను చూసీచూడటంతోటే మా ఆవిడ విరగబడి నవ్వటం ప్రారంభించింది. నాకు అరికాలిమంట నెత్తికి – కాదు బోడిగుండుకు ఎక్కింది. అసలు నా బోడిగుండును చూసయితే ఆవిడ నవ్వింది కాని – ఆ గుండులోని మహత్యం దానికేం తెలుసు? ఈ సంగతి ఆమెకు చెప్తే కాని లాభం లేదనుకొని, “చూడు శ్యామా! నా బోడిగుండునయితే చూసి ఎగతాళి చేశావు కాని – దీనిలోవున్న లాభం నీకేం తెలుసు? ఇది సాదాగుండు అనుకున్నావా? శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మహాప్రసాదం! ఇప్పుడు నాకు పేలబాధ లేదు!” అన్నాను నా గొప్ప బోడిగుండు మాహాత్మ్యం ఆమెకు బాగా బోధపడేటట్టు!

“అయ్యో! అయితే – ఆ పేల నన్నిటినీ చంపారు టండీ?” – అన్నది ఆవిడ – ఆ వెధవజంతువులకు సానుభూతి చూపుతూ.

“చంపలేదు; వెంకటేశ్వర స్వామికి కానుకగా ఇచ్చాను” – అన్నాను, ఆమెను ఓదారుద్దామని.

"ఎంత జీవహింస చేశారండీ! ఎంత పాపమండీ!" - అన్నది ఆవిడ.

"ఛత్! జీవహింసేమిటి? స్వామివారి పాదసేవ చేసికొని అవి తరిస్తాయి. నాకు మాత్రం వాటి బాధే లేదు. నువ్వుకూడా ...." నా మాట పూర్తికాక పూర్వమే, "చాల్లే వూరుకోండి!" - అంటూ మూతిముడుచుకొని ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఇంక నా స్నేహితులు నా బోడిగుండును చూసి నవ్వారు. నా గుండుమీద మొట్టికాయలు వేసి వినోదించారు. మఱి కొందరు నా గుండును ముద్దుపెట్టుకొని ఎకసక్కాలాడారు.

కాని నేను చెప్పాను: "మీ వేళాకోళాలు కట్టిపెట్టి నేను చెప్పే విషయాన్ని ఆలకించండోయ్! దీన్ని దేశవాళీ సరుకు లాగు నీచంగా చూస్తున్నారు. వెంకటేశ్వరమహత్యం, చిదంబర రహస్యం, కుంభకోణం - ఇవన్నీ యీ గుండులో ఇమిడివున్నాయ్! నేను ఇదివరలో పేలతో పడ్డ బాధ మీకందరకూ తెలిసిందే. ఎంతోమంది డాక్టర్లు నాకు సరైన సలహా యివ్వలేకపోయారు. కాని నేను జనుల ఉపయోగానికి గాను నా యీ పరిశోధనా ఫలితాన్ని ఉచితంగా ప్రకటించేస్తున్నాను. ముద్దులమూటకట్టే, యీబోడిగుండు తయారయ్యాక నాకు పేలబాధ వదిలింది. మీలో ఎవరికన్నా పేలబాధ వుంటే, బోడిగుండు చేయించుకొని, నేను చెప్పిన విషయాన్ని పరీక్షించుకోవచ్చు! ఈలోకంలో పేలకు ఇంతకన్నా మంచి ఔషధంలేదు. ఇది తథ్యం! స్త్రీ పురుష విచక్షత లేకుండా - నా యీ సలహాని ఉపయోగించుకోండి!"

నా లెక్చరయ్యాక, నా స్నేహితుల్లో రామం అన్నాడు : "ఓయీ! పెద్దమ్మా నీకు ఈ మాత్రం తెలివితేటలు ఉండబట్టే - ప్రమోషన్ లేకుండా వుంది! ఈపాటి స్వల్పవిషయాన్ని నేర్చుకునేందుకు, తిరుపతిదాకా వెళ్ళి మోకాళ్ళ పర్వతాన్ని దేకవలసివచ్చింది. నీవు కనిపెట్టిన విషయం కొత్తది కానేకాదు. మూలకూర్చున్న ముసలమ్మలుకూడా, అణా డబ్బులతో గ్లోబులు తయారు చేయించుకుంటున్నారు; మన టెంకాయలే ఇందుకు నిదర్శనం, ఈమాత్రపు మందు అందరికీ తెలుసు. మా దగ్గర అంటే అన్నావుకాని - ఏ స్త్రీ దగ్గరి కయినావెళ్ళి, 'నీతలలో పేలు పోవాలంటే నాలాగే బోడి గుండు చేయించుకో' అని అన్నావా - నీకు దేహశుద్ధి కాగలదు! కాబట్టి, ఇంకెక్కడా ఈ విషయాన్ని ప్రకటించి, పరువు పోగొట్టుకోబోకు. కొంచెం ఒళ్ళు దగ్గర పెట్టుకోవోయ్ - నాటు టెంకాయా!"

రామం చెప్పిన మాటలకు నా స్నేహితులందరూ ఫక్కున నవ్వారు. నా కేమీ తోచక - పేల బాధ వదిలినా - బుర్రగోక్కుంటూ స్తబ్ధుణ్ణయి శిలా విగ్రహంలాగు నిలబడిపోయాను. ఇకముందెప్పుడూ 'రిసెర్చ్ వర్క్' మొదలు పెట్టకూడదని చెంపలు వాయించుకున్నాను.

- జూన్, *1940*